# భగవదనుగ్రహమును సాధించండి

**బుద్ధి నిలకడ లేని మనుజుడు పొందజాలడు శాంతిసుఖములు**
**విషయ సుఖముల వెంట పరిగిడు వెఱ్ఱిజీవికి ఎచట శాంతి?**
**కన్ను విప్పి చూడరోరన్నా.**

**విద్యార్థులారా!**

సర్వమతములు హృదయ పరిశుద్ధతను గురించియే ప్రబోధిస్తూ వచ్చినవి. అట్టి హృదయ పరిశుద్ధిలేని మానవుడు ఎన్ని విధములైన సాధనలు చేసినప్పటికి ప్రయోజనము లేదని ప్రబోధిస్తూ వచ్చినవి. చిత్తమునందు అహంకారమనే మాలిన్యము దట్టముగా పేరుకొని ఉండుటచేత శుద్ధి ఏరీతిగా మనకు లభిస్తుంది? శరీరమును జలముతో మనము పరిశుద్ధము గావించుకోవచ్చును. కాని హృదయము పరిశుద్ధము గావించుకోవలెనన్న దీనికి కావలసిన పదార్థము యేమిటి? ఇదియే నామ చింతన.

భగవన్నామము ఒక్కటి మాత్రమే హృదయమును పరిశుద్ధము గావించే పవిత్రమైన పదార్థము. దానవుడైన ప్రహ్లాదుడు, పక్షియైన జటాయువు, మృగమైన గజపతి కేవలము నామచింతన చేతనే తమ దివ్యతత్త్వాన్ని గుర్తించి జన్మసార్థకము గావించుకున్నారు. అహంకారము ఉండినంతవరకు ప్రహ్లాదుడుగాని, జటాయువుగాని, గజరాజుగాని శాంతి సంతోషములను అనుభవించలేక పోయెను. తమ తమ భౌతిక శక్తులను ఉపయోగపరచుకొని ఆ శక్తుల చేతనే విజయాన్ని సాధించవచ్చునని ఇవి గర్వించినవి. కడపటికి భౌతిక బలము, భౌతిక శక్తియు నిష్ప్రయోజన మని గుర్తించుకున్నాయి. దైవబలమే నిజమైన బలమనియు, దైవనామమే నిజమైన బలమనియు విశ్వసించి 'నీవే తప్ప నితః పరం బెరుగ' అని ప్రార్థించినవి.

కౌరవ సభయందు అనేక విధములుగా బాధించుటకై పూనుకున్న సమయములో ఎవరు రక్షించారు? ద్రౌపదియొక్క పతులు మహా బలవంతులే, శక్తిమంతులే, ధర్మమూర్తులే చెంతనే ఉండికూడను ఈమె బాధనివారణ చేయలేక పోయారు. ఆమె దుఃఖమును శాంతి పరచలేకపోయారు. అప్పుడు ఆమె తలచింది భౌతిక జగత్తునందు కలిగిన బంధువులు

sri sathyasai vahini amrutam

ఎవ్వరుకూడను దుఃఖమును పరిహారము గావించలేరు. ఎవరికివారే సమస్తమైన దుఃఖములో క్రుంగి కూలిపోతున్న వ్యక్తులు మరొకని దుఃఖమును ఏరీతిగా నివారణ గావించగలరు? ప్రతి మానవుడు ఏదో ఒక విధమైన దుఃఖముతో, విచారముతో కుమిలిపోతున్నాడు. తన విచారమునే తాను పోగొట్టుకోలేని బలహీనుడు ఇతరుల యొక్క విచారములు యేరీతిగా పోగొట్టగలడు? మానవుని బాధలు మానవుడు ఏనాడు తప్పించలేడు. ఏదో భౌతికమైన, లౌకికమైన, తాత్కాలికమైన బాధలు కొంత నివారణ గావచ్చునేగాని మితిమీరిన బాధలను, మతి తప్పిన బాధలను నివారణ చేసేది మాధవుడొక్కడే. మాధవనామ మొక్కటేయని కృష్ణనామము స్మరించింది ద్రౌపది. ఆ భయంకరమైన సమయము నందు ఒక్క భగవన్నామము మాత్రమే ఆమెను రక్షించింది; గౌరవాన్ని నిలిపింది.

తులసీదాసు హేతు కృశాను భాను హిమకరతే అన్నాడు. అనగా ఈ జగత్తుకంతా హేతువు కృశాను భాను హిమకరులు. అగ్ని సూర్యుడు చంద్రుడు. ఈ మూడింటిపైనే ఈ జగత్తు ఆధారపడి ఉంటుండాది. ఈ జగత్తును నిలబెట్టినవి అగ్ని సూర్యుడు చంద్రుడు మాత్రమే. దేవుడు లేడని వాదించే నాస్తికుడు కూడను అగ్ని సూర్యచంద్రాదులు లేకపోతే జీవించలేమని అర్థము గావించుకుంటారు. అగ్ని, సూర్యుడు, చంద్రుడు ప్రధానమైన స్థానము నందుంచుకొనుటకు మూలకారణమేమిటి? భక్తుని హృదయము పవిత్రమైనది, పరిశుద్ధమైనది, ప్రేమపూరితమైనది. అందువలన అగ్నికి సూర్యునకు చంద్రునకు రాముని నామమును పోల్చుకున్నాడు.

**కలిలో నామమే శరణ్యము**

రామ నామమునకు ర.అ.మ ఈ మూడక్షరములు ప్రధానమైనవి. కృశాను భాను హిమకర అనే పదములకు ర,అ,మ ఈ మూడింటిని సమన్వయము గావించుకున్నాడు. భానుడనగా సూర్యుడు, హిమకరుడనగా చంద్రుడు. ర.అ.మ ఈ మూడు కూడను కృశాను భాను హిమకర అని వర్ణించుకుంటూ వచ్చాడు తులసీదాసు. ర అనేది తత్‌గా భావించుకున్నాడు. మ అనేది త్వమ్‌గా భావించుకున్నాడు. రామ రెండు చేరి తత్వమసి ఇదే రామమూర్తి స్వరూపమన్నాడు. ఐతే ఈ రామనామమనేది ఎక్కడ నుండి ఆవిర్భవించింది? ఎవరు దీనిని అందిచ్చారు? ఎవరు

srisathyasaivahini.org

దీనిని సృష్టించారు అనే విషయాన్ని మనము చక్కగా విచారణ చేసుకుంటే ప్రాచేతసుడనే వాల్మీకి పూర్వము కిరాతకుడుగా ఉండి మహర్షుల బోధలచేత సత్సంగము చేత, భగవన్నామము చేత మొట్ట మొదటి ఋషిగా ఏర్పడినాడు. భగవంతుడు లోకదాతగాయైనప్పుడు వాల్మీకి శ్లోకదాతగా మారాడు. వాల్మీకి రామనామము చేతనే రామాయణమును ప్రారంభించాడు. రామాయణములో నూరు కోట్ల శ్లోకములు లిఖించాడు. ఈ రామనామమనేది రామచింతన అనేది త్రిలోకములకు సంబంధించినది. ఇది త్రిలోకముల యొక్క సొత్తు. కేవలము ఒక్క లోకమునకు సంబంధించినది కాదు. భూర్భువస్సువః పాతాళలోకము, భూలోకము, ఊర్ధ్వలోకము మూడులోకములకు సంబంధించినది, రామచరితము. మానవులు దేవతలు దుర్మారులైన రాక్షసులు కూడను వచ్చి ఈ నామమును సమంగా పంచి యివ్వాలి అని ప్రార్థించారు.

**సాయినామ విశిష్టత**

నూరు కోట్ల శ్లోకములు మూడు లోకములకు ఏరీతిగా సమంగా పంచి యివ్వటానికి వీలౌతుంది. రామణ్ణేచింతించుకున్నాడు. రామనామము చేతను ఆ vision, ఆ vibration తన హృదయములో ప్రారంభించింది. నేను పంచివ్వగలనని హామీ ఇచ్చాడు. ఒక్కొక్క లోకమునకు 33 కోట్ల 33 లక్షల 33 వేల 333గా పంచి ఇచ్చాడు. ఒక్క శ్లోకం మిగిలింది. ఈ శ్లోకమును ఏరీతిగా పంచాలి ఇందులో అక్షరములు ఎన్ని అని విచారణ చేశాడు. ఇందులో 32 అక్షరములుంటున్నాయి. ఈ 32 అక్షరములు మూడు లోకములకు యేరీతిగా సమంగా పంచి ఇవ్వాలి? యోచన చేశాడు. తిరిగి రామ చింతనే సలిపాడు. రాముడే దీనికి జవాబందించాడు. పది పది అక్షరములు ఒక్కొక్క లోకమున కందించాడు. ఇక మిగిలినవి రెండక్షరములే. ఈ రెండక్షరములు రామ, హరి, హర కృష్ణా, సాయి అని ఈ రకమైన రెండక్షరములు. పేర్లను మాత్రమే మూడు లోకములకు సమముగా అందించాడు. కనుకనే నామము జీవితమునకు నావ వంటిది. ఈ సంసారమనే సాగరము నుండి తరించాలని ప్రార్థించే వ్యక్తికి భగవన్నామము అత్యవసరము. అందువల్లనే కలియుగమునందు నామమే ప్రధానము.

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం**

srisathyasaivachanamrutam

**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా.**

భగవంతుని నామము తప్ప కలియుగము లోపల ధ్యానముగాని, యోగముగాని, తపస్సుగాని, యజ్ఞముగాని, యాగముగాని చేసి మానసిక శాంతిని పొందలేమని నిర్ణయించుకున్నారు.

భగవన్నామము విషమునుకూడను అమృతముగా మార్చగలదు. మీరా అన్ని వేళలయందు, అన్ని స్థానములందు కృష్ణనామమునే స్మరిస్తుండేది. పరిస్థితిని గుర్తించిన మహారాణా ఈమె పిచ్చితనమును మార్చటానికి ప్రయత్నించి అనేక యుక్తులు పన్నాడు. ఈమెకు భేదము లేదు. అభిమాన మమకారములు లేవు. అహంకార ఆడంబరములు లేవు. ఏ రాజులమధ్యనైనా, ఏ సాధువులమధ్యనైనా, ఏ వ్యక్తుల మధ్యనైనా, ఏ బజారునందైనా కృష్ణనామము స్మరిస్తూ పోయేది. రామరతన ధనపాయో, పాయోరేమైనే అంటు బజారువెంట పాడుకుంటూ పోయేది. మహారాణా ఈ దృశ్యాన్ని చూశాడు. నేను రాజస్థానమున ఉండినవాడను. నా ధర్మపత్ని ఈ రాజుల మధ్యలో, ఈ సాధువుల మధ్యలో భిక్షకుని వలె తంబురు వాయించుకుంటూ పోతుండాది. నాకగౌరవం కదా అని భావించాడు.

ఆమె అనేక పర్యాయములు చెప్పింది. భగవన్నామము ఉచ్చరించే దానిలో గౌరవము అగౌరవము ఏమిటుండాది. భగవన్నామము ఉచ్చరించటమే గౌరవము. ఉచ్చరించకపోవటమే అగౌరవము. పదిమంది వింటారనిగాని, పదిమంది ఏమనుకుంటారనిగాని అభిమానమునకు చోటిస్తే నీకు ఆత్మతత్త్వమే క్షీణించిపోతుంది. ధైర్యముతో సాహసముతో ఇది నా కర్తవ్యము, ఇది నా ఇష్టము అని అభిమాన మమకారములను జయించి దైవనామాన్ని స్మరించాలి. ఈమె ఈ విధమైన ధైర్యము చేతను, సాహసము చేత బయటవారి ప్రభావముతో తన స్వభావమును మార్చుకోలేదు. మహారాజు ఆమెకు నచ్చచెప్పటానికి అనేక విధముల ప్రయత్నించాడు. మీరా! నీవు ఈ విధముగా పాడుతుంటే జగత్తంతా నిన్ను ఒక పిచ్చిదిగా భావిస్తుంది. లోకులు కాకులవలె వాగుతారు అన్నాడు. మీరా అప్పుడు చెప్పింది. మహారాజా! కాకుల కూతలకై కోకిలలు తమ గానమును మానుకుంటాయా? కాకుల కూతలు కాకులవిగానే ఉంటాయి. కాకికి భయపడి కోకిలలు తమ గానాన్ని మానుకుంటాయా లోకులు కాకులు. భగవన్నామము కోకిల గానము. చుక్కలను చూచి కుక్కలు మొరిగితే చుక్కలు క్రిందికి రాలవు. మహారాజా చుక్కలెక్కడ కుక్కలెక్కడ?

srisathyasaivachanamrutam

అత్యంత ఉన్నత స్థాయి యందున్న భగవన్నామమును ఉచ్చరించటములో చిలిపి చేష్టలతో కూడిన, అజ్ఞాన అహంకారములతో కూడిన ఈ లోకులకు మనమెందుకు లొంగాలి. ఈ విధముగా ఆమె వాదించేటప్పటికి అతనికి చాలా కోపం వచ్చింది. రాజు రజోగుణము వాడు. భక్తుడు శుద్ధ సాత్వికమైనవాడు. రాజరికమునకు సాత్వికమునకు పొత్తు కుదరదు. నీటికి నిప్పుకు పొత్తు ఎట్లా కుదురుతుంది. నీరుఉంటే నిప్పు ఉండదు. నిప్పు వుంటే నీరు ఉండదు. కాని నీరు నుంచే నిప్పు వచ్చింది. ఈ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యములను మీరా చక్కగా బోధిస్తూ వచ్చింది. ఈ బోధ మహారాణాకు మాత్రమే కాదు. లోక జనులకందరకు చక్కగా కనువిప్పుగా చూపించింది.

అనేకమంది మన విద్యార్థులు కూడను హాలీడేస్‌లో ఇండ్లకు పోయినప్పుడు భోజనానికి కూర్చునప్పుడు బ్రహ్మార్పణం అని ప్రార్థన చెప్పాలంటే అందరు యేమనుకుంటారో అని భయపడతారు. ఏమిటి భయం?

**భయమును దయ్యమును పారగద్రోలి నిర్భయముగ నుండరయ్య**
**పాపంబన భయముండవలెనయ్యా లోకము తోటి భయము**
**మీకేలనయ్యా అందరికి భయపడి దేవుని భజన**
**చేయగలేక భ్రమ చెంది మరణించే సమయమందున**
**బలిమి మీరగ యముడు రమ్మిక రమ్మనుచు లాగంగనప్పుడు**
**అయ్యయ్యొ అని యేడ్వగ నెవ్వరు అడ్డగింపగ వత్తురయ్య**

ఈనాడు మనము భయపడి భగవన్నామాన్ని స్మరించకుండా వదలిపెట్టినప్పుడు మనకు యమపాశములు వచ్చి వెళ్లువెళ్లని హింసించే సమయము లోపల అయ్యయ్యో అనుకుంటే విడిపించేవారు ఇంకెవరు రక్షించేవారెవరు? జీవితకాలములో చేసిన స్మరణ అంత్యకాలములో ఆదరణ కోసమని. కనుక ఈ లేత వయసునందే భగవన్నామాన్ని ఉచ్చరించుకుంటూ పోయినప్పుడే అంత్యకాలము ఎప్పుడో అప్పుడే ఇనవ్నీ కూడను మనను రక్షించటానికి అవకాశమువ ఉంటుంది.

**నామస్మరణను మించిన తపము లేదు**

sri sathyasai vahamrutam

విద్యార్థులారా! భగవన్నామాన్ని స్మరించటములో మీరేమాత్రము భయపడకూడదు. అభిమాన మమకారములకు అంతకంటే అవకాశమివ్వకూడదు. అభిమాన మమకారములచేత మనము కృంగిపోయినప్పుడు మన జీవితమే కృశింప చేసుకుంటాము ప్రతి ఒక్కటి భగవదర్పితము గావించాలి. ఏ హృదయ మొసగితివొ ఈశ! నాకు మగిడి దానినే అర్పింతు మహితమూర్తి. ఈ దేహమెవరిచ్చారు, ఈ బుద్ధి ఎవరిచ్చారు? జీర్ణకోశమెవరిచ్చారు? ఈ ప్రాణమెవరిచ్చారు? ప్రతి నరమునందు అంగీరసుడు ప్రతి అంగమున ఈ శక్తి నెవరిచ్చారు? అన్నీ ఇచ్చినవాడవు నీవే. 'మగిడి దానినే అర్పింతు మహిత మూర్తి.' ఏది నీవు నాకిచ్చావో దానినే నీకర్పితము చేస్తున్నాను. నేను తెచ్చినది కాదు. నేను ఇచ్చినది కాదు. నీవు ఇచ్చినది నీకే ఇస్తున్నాను.

చాలా మంది నిష్ఠాగరిష్ఠులైన పండితులు గోదావరి, కృష్ణ, గంగ యమున, కావేరి ఇత్యాది నదులకు పోయి సంధ్య వార్చుకుంటారు. పుణ్య నదుల్లో సంధ్య వార్చుకోవటం మహా పవిత్రమని భావిస్తుంటారు. చేతిలో ఆ నదియొక్క నీరు తీసుకుంటారు. కేశవాయనమః, మాధవాయనమః, నారాయణాయనమః అంటూ తిరిగి ఆ నీటిని గంగకే విడిచిపెడతారు. విడిచిపెట్టిన నీరు తిరిగి తీసుకుంటారు. తిరిగి గంగకే వదిలిపెడతారు. వీరు కొత్త నీరు ఎక్కడ నుంచి తెచ్చారు? కనుక నీవిచ్చేది భగవంతుని దగ్గర నుంచి పుచ్చుకున్నదే గాని నీ సొత్తుకాదు. తన సొత్తు తనకే యిచ్చే దానిలో అభిమాన మేమిటి? మమకారమేమిటి? అహంకారమేమిటి? దీని వలననే మానవత్వమనేది మరుగు పడిపోతుండాది. భగవన్నామము ఉచ్చరించటంలోగాని, భగవన్నామస్మరణ చేయటంలోగాని, భగవద్ధ్యానం చేయటంలోగాని ఎవరికి మనము వెరువనక్కర లేదు.

ఎవరైనా వచ్చి వాదించవచ్చును. ఏమిట్రా పిచ్చివాడా! దేవుడెక్కడ ఉన్నాడు? ఎందుకోసం ఈ విధముగా స్మరిస్తున్నావు అని హేళన చేయవచ్చు. అయ్యా నీకు లేకపోవచ్చును. నాకు ఉన్నాడు అంటూ ధైర్యముగా ఎదుర్కొవాలి. నీకు దేవుడు లేనన్నప్పుడు నీకు లేదని చెప్పుకో. నాకున్న దేవుడు లేడనటానికి నీవెవరు? నా విశ్వాసము నాది, నీ విశ్వాసము నీది. నీవు శ్వాస విడుస్తున్నావు తీసుకుంటున్నావు. నేను శ్వాస విడుస్తున్నాను తీసుకుంటున్నాను. ఐతే నా

sri sathyasaivachanamrutam

శ్వాస నిమిత్తమై నీ శ్వాస పట్టుకోవటానికి వీలవుతుందా? లేక నీ శ్వాస నిమిత్తమై నా శ్వాస అరికట్టటానికి వీలవుతుందా? నీ శ్వాసనీది నా శ్వాస నాదే. అదే విశ్వాసము. ఇతరుల విశ్వాసాన్ని నీవెందుకు అనుసరించాలి. నీ విశ్వాసాన్ని నీవు అనుసరించు. ఎవరికో కన్నులు చాలా బాగా ఉంటున్నాయి. సూర్యచంద్రాదుల మాదిరి కనిపిస్తున్నాయని తన కండ్లు మూసుకొని ఆ కండ్లపైన ఆధారపడి నడవటానికి వీలవుతుందా? తన కండ్లపైన తాను ఆధారపడాలి. తన విశ్వాసముపైన తాను స్థిరముగా ఉండాలి. అదే నిశ్చలమైన పద్ధతి. అదే బుద్ధి నిలకడ లేని మనుజుడు పొందజాలడు శాంతి సుఖములు. ఈ విశ్వాసాన్ని హృదయమునందు దిట్టముగా మనము పెట్టుకున్నప్పుడే ఇది సరియైన మార్గాన్ని మనకు చేకూరుస్తుంది. విజయాన్ని అందిస్తుంది. కనుక లోకము నిమిత్తమై మీరే మాత్రము వెరువనక్కర లేదు.

ఈ విధముగా మీరా మహారాణాతో వాదించింది. కాని మహారాణాకు ఈ మంచి మాటలు చెవుల్లో చేరలేదు. ఈమె ముద్ద ఖర్జూరము తినే స్వభావము. మహారాణా చింతపండు తినే స్వభావము. ముద్ద ఖర్జూరము తినేవారికి చింతపండు రుచించదు. చింతపండు తినేవానికి ముద్ద ఖర్జూరము రుచించదు. అజీర్ణమైన వానికి ఆకలి సంగతి తెలియదు. ఆకలయ్యేవానికి అజీర్ణం సంగతి తెలియదు. అజీర్ణము వాడొచ్చి ఒరే ఇంత భోజనం చేయొద్దురా అంటే పో పో నీకేం బుద్ధి లేదా? నాకాకలవుతుంది తినాలంటాడు. ఇష్టము లేనివారు అజీర్ణవంతులు. ఇష్టముతో భరించేవాడు జీర్ణము చేసుకునేవాడు కాబట్టి ఈ యిద్దరికి పొత్తు కుదరదు. వారు ఇష్టపడనీ, ఇష్టపడకపోనీ మనం చేయవల్సింది చేయవలసిందే. ఈ మహారాణాకు మీరాకు యిట్టి సంబంధ బాంధవ్యము కలిగింది. ఇక వీలుకాదని భావించుకున్నాడు. ఈమె ఉండినంతవరకు ఈ విధమైన అవమానముల పాలు కావల్సి వస్తుందనుకున్నాడు. తన చెల్లెలు దగ్గరకు వెళ్లాడు. పాలలో విషము కలిపించి ఇప్పించాడు. మీరా సర్వమును భగవంతునికి అర్పితము చేసి భుజించేది.

**సమస్తము భగవదర్పితముగా భావించండి**

విద్యార్థులారా! మీరు చక్కగా గుర్తించవలసిన విషయము. మీరు హాస్టలునందుగాని మరొకచోటగాని భుజించే ముందుగా బ్రహ్మార్పణము గావించి భుజించమని బోధించాము.

srisathyasaivachanamrutam

ఎందుకనగా ఆహారములో అనేక రకములుగా అశుద్ధములు చేరుతుంటాయి. పాక శుద్ధి అన్నారు. వంటవాడు శుద్ధముగా లేకపోవచ్చును. దేహము ఉండినా బుద్ధి శుద్ధిగా లేకపోవచ్చును. వాడు ఏమేమో చింతించుకుంటూ వంట చేయవచ్చును. ఇంక పాత్ర శుద్ధి. పాత్ర సరిగా శుద్ధి లేకుండా ఉండవచ్చును. పదార్థ శుద్ధి. పదార్థమంటే మీరు ఏమనుకున్నారు? మన ఇంటిలో అన్నీ బాగా కడిగి అన్నీ శుభ్రముగా పెట్టుకుంటున్నాము. ఇది కాదు శుద్ధి. మనం బజారు నుంచి కూరగాయలు తెచ్చుకుంటున్నాము. కూరగాయలు తాను పండించినాడో, ఎక్కడైనో దొంగతనము చేసినాడో ఏ విధముగా తీసుకొని వచ్చినాడో మనకు తెలియదు. ఈ కూరగాయలలో అనేక దోషాలంతా ఉంటున్నాయి. ప్రక్కింటి వారి మునగచెట్టు మన ఇంటిలో వాలి ఉన్నప్పుడు ఇంటిలో ఉన్నది కదా అని మనము కాయలు కోసుకోవచ్చు. అది దొంగతనముగా లభించిన కూరగాయలే. ఆ కూరగాయలు దోషంగా ఉంటుంటాయి. కనుక ఈ పదార్థముల దోషాన్ని మనము విచారించటానికి సాధ్యం కాదు. వంటవాని thoughts ఏ విధముగా ఉన్నాయో వివరించటానికి వీలు లేదు. ఈ రకమైన అనేక దోషములుంటుంటాయి. మనము బ్రహార్పణము గావిస్తే, భగవదర్పితము గావించినప్పుడు అది పదార్థము కాదు, భోజనము కాదు ప్రసాదముగా మారుతుంది. ప్రసాదంగా మారినప్పుడు దాంట్లో ఎట్టి దోషములు ఉండవు. అందువలననే

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా.**

అంటూ బ్రహ్మార్పణం చెయ్యాలి. ఎందువలన చేయాలంటే

**అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

నాలుగు రకములుగా మనము భుజించే ఆహారాన్ని భగవంతుడు పరిశుద్ధము చేస్తున్నాడట. అదే అహం వైశ్వానరోభూత్వా ఒరే పిచ్చివాడా! నేను నీలో వైశ్వానర రూపములో ఉంటున్నాను. నాలుగు విధములైన ఆహారములు ఏమిటివి? ఒక ఆహారము చక్కగా ఒక ముద్దగా మాదిరిచేసి పండ్లతో నమిలి కరిగింపజేసి మింగటం. రెండవది చప్పరించి మింగటం. మూడవది జుఱ్ఱుకోటం. మజ్జిగ వేసుకుంటుంటారు చూడు బుస్ అని శబ్దం. అది జుఱ్ఱుకోటం. నాలుగవది

నంజుకోటం. పికిల్స్, పాయసము, మజ్జిగ ఊరికే మింగేస్తారు. నమలరు, చప్పరించరు. నమిలేది, చప్పరించేది, మింగేది టేస్టు చూచేది. ఈ నాలుగు రకములైన ఆహారమును నేను పరిశుద్ధముగావిస్తాను. అని భగవంతుడు ప్రామిస్ ఇస్తున్నాడు.

**ఆత్మానందుని వృత్తాంతము**

విద్యార్థులారా! ఈ పాక శుద్ధి గుర్తించటానికి వీలుకాదు కనుకనే మనము భగవదర్పితము గావించుకునేదాని గొప్పతనము యెట్టిదో ప్రత్యక్ష నిదర్శనము చూపిస్తాను. హృషీకేశ్‌లో సచ్చిదానంద ఆశ్రమము ఉండేది. ఇందులో అందరు సాధువులకు భోజనము, రొట్టె అందిస్తూ ఉండేవారు. భక్తులు, యాత్రికులుగా పోయినవారు సాధువులకు ఒక్కొక్క భిక్షగా ఏర్పరచుకొనేవారు. హృషీకేశ్‌లో వ్యాపారము చేసేవారు కూడను వారమునకు ఒక తూరో ఇంకేదైనా విశేష దినమునవో సన్యాసులకు భిక్షను పెట్టేవారు. ఈ విధముగా ఉంటుండగా ఒక మార్వాడి అన్ని పదార్థముల కొట్టు పెట్టుకున్నాడు. బియ్యము, బేడలు ఇట్లాంటి వంతా తూకము వేసేవాడు ఒకడు అతని దగ్గర ఉండేవాడు. అతనికి భార్య మరణించింది. అతనికి యుక్త వయసు వచ్చిన 18 సంవత్సరముల బిడ్డ ఉండినాది. ఆ అమ్మాయికి కళ్యాణము చేయటానికికాని ఇంటిలో ఉండి ఆమెను చూచుకోటానికిగాని ఎవరూ దిక్కులేరు పాపం. ఈ విధముగా ఉంటుంటే మార్వాడి మధ్యవర్తుల ద్వారా ఇతనికి వార్త పంపించాడు. తాను directగా అడగటానికి ధైర్యం లేదు. మార్వాడి చాలా చిన్నవయసువాడు 65 సంవత్సరములు. ఈ 65 సంవత్సరము మార్వాడీకి 18 సంవత్సరముల వయస్సున్న కన్యను ఇచ్చి పెండ్లి చేయమని కోరూతూ వచ్చారు.

బీదవాడైన ఆ తండ్రి ఏదో విధముగా అమ్మాయి బాధ్యత తీర్చుకోవాలనుకున్నాడు. అంగీకరించాడు. ఈమె బాగా బ్రతుకుతుంది గదా. తినటానికి కట్టటానికి బాగా ఉంటుండాది వసతులు అని అనుకున్నాడు. తనకు కూడా ఏదైనా సహాయం చేస్తాడేమో అనే దురాశపడ్డాడు. ఒక శుభముహూర్తములో అమ్మాయిని మార్వాడికి ఇచ్చి పెండ్లి చేశాడు. పెండ్లైన దినము నుంచి ఆ కన్య నిరంతరము కంటి ధారలతోనే కాలము గడుపుతూ వచ్చింది పాపం. ఎప్పుడు చూసినా ఏడ్చుటమే. నా జీవితము దురవలస్థలపాలైంది కదా అని. మూడవ దినమున ఆమెను

srisathyasaivachanamrutam

మార్వాడి ఇంటికి తెచ్చారు. ఆమెకు కనిపించే భోగభాగ్యములు ఒక్కటి కూడను ఆనందాన్నందించలేదు. మార్వాడి గృహములు, వసతులు కావలసినంత తిండి తీర్థములు, సదుపాయముల, వెండి బంగారము అది ఇవీ కావలసిన నగలంతా పెట్టాడు పాపం. మానసిక సంబంధమైన బాధలను ధన, కనక, వస్తు, వాహనాదులు దూరం చేయగలవా? అది ఎవ్వరు కూడను దూరము చేయటానికి వీలుకాదు.

రాత్రికి రాత్రి మార్వాడి చక్కగా గురకపెడుతూ నిద్రించే సమయములో తాను తలుపు తీసుకొని పోయింది. గంగలో పడిపోయింది. సరే గట్టుకు తేలింది. అందరు తెలుసుకున్నారు. ఫలాన వ్యక్తి అని గుర్తించారు. పదకొండవ దినము ఆ మార్వాడి కర్మకాండ సమయములో సచ్చిదానంద ఆశ్రమానికి రొట్టెలు, పాయసం, వడలు యింకా కావలసిన పదార్థములంతా బాగా చేసుకొండని రెండువేల రూపాయలు పంపించాడు. ఆనాడు ఆశ్రమములోపల సన్యాసులకంతా మంచి విందు. బాగా బాదం ఖీరు చేశారు హల్వా చేశారు అన్నీ చేశారు. అందరు బాగా భుజించారు.

ఆ ఆశ్రమములోపల పరిశుద్ధ హృదయుడు, నిర్మల చిత్తుడు, నిరంతరము ధ్యానమగ్నుడైన ఆత్మానందుడు అని సాధువు ఒకడుండేవాడు. అతను అనేక పర్యాయములు స్వామి దగ్గరకు వచ్చాడు పాపం. అన్నీ వదలి ఇక్కడే ఉంటానని కోరాడు. కానీ సాధువులకిక్కడ స్థానం లేదు. నీవు ఉండవలసిన స్థానం అక్కడే. వెళ్ళిపొమ్మని చెప్పాను. ఒక జపమాల ఇచ్చాను. దాన్ని తీసుకుని తృప్తిగా వెళ్ళాడు. ఆనాడు భోజనం చేశాడు. చక్కగా పాయసం త్రాగాడు. వడలు తిన్నాడు. రొట్టెలు తిన్నాడు. భోజనమైన తరువాత తిరిగి సాయంకాలము ధ్యానములో కూర్చున్నాడు. ఆ ధ్యానములో కూర్చునేటప్పటికి ఒక 18 సంవత్సరముల వయసు కలిగిన యువతి కనిపిస్తున్నాది. ఎట్లా కనిపిస్తున్నాది. ఏడుస్తూ కనిపిస్తున్నాది. తాను చూశాడు. ఛీ! ఏనాడు నా భావములు ఈ దుర్మార్గములో పోలేదే ఎందుకు నాకు ధ్యానములో ఈ విధముగా కనిపిస్తున్నాది అని తిరిగి గంగకు పోయాడు. స్నానం చేశాడు. కాళ్లు చేతులు కడుకున్నాడు. తిరిగివచ్చి ధ్యానంలో కూర్చున్నాడు. తిరిగి అదే దర్శనము కనిపిస్తున్నాది పాపం. ఆ రాత్రంతా

srisathyasaivachanamrutam

తాను నిద్రపోలేదు పాపం. ఏమిటి నాలో దోషము? ఏమిటి నాలో దోషమని తన దోషాన్ని చాలా విచారం చేస్తూ వచ్చాడు. కాని తనకర్థం రాలేదు. తనలో దోషములు లేవు.

రెండవ దినము తెల్లవారుతూనే స్నానం చేశాడు. తిరిగి ధ్యానములో కూర్చున్నాడు. తిరిగి అదే దృశ్యం. ధ్యానములో కనిపిస్తున్నాది. అప్పుడు లేచి ఇంక ఆశ్రమములో ప్రవేశించి సచ్చిదానంద దగ్గరికి వెళ్లాడు. అదే దినము అదే సమయానికి శివానంద ఆశ్రమము నుంచి బ్రహ్మానందమనే వ్యక్తి సచ్చిదానందాన్ని చూడటానికి వెళ్ళాడు. వీరిద్దరు మాట్లాడుతున్నప్పుడు ఈ ఆత్మానందం యేడ్చుకుంటూ పోయి కాళ్లమీద పడ్డాడు. 'గురూజీ! ఏమిటి నా పాపము. నాలో ఏమిటి దోషము. ఈ విధముగా నాకు దృశ్యము కనిపిస్తున్నాది' అన్నాడు. నీవు రాత్రి ఏమి భోజనం చేశావు అడిగాడు. నేను విందు భోజనం చేశాను. పాయసము రొట్టె హల్వా అన్నీ భోజనము చేశానన్నాడు. ఈ పదార్థము ఎక్కడ నుంచి తెచ్చారు అన్నాడు. అప్పుడు సచ్చిదానందము చెప్పాడు. ఒక మార్వాడీ మీరందరు భోజనానికి ఈవేళ నా భిక్షం తీసుకోండని డబ్బు పంపించాడు. దానితో నేను చేయించాను అన్నాడు. ఈ మార్వాడి సన్యాసులకు భిక్ష పెట్టటానికి కారణము ఏమిటని విచారించారు. చిన్న అమ్మాయిని పెండ్లి చేసుకోటం, ఆ అమ్మాయి మనసు కష్టంచేత నదిలో పడి ప్రాణం వదలటము. ఆమె కర్మ రూపకంగా ఈ విందు గావించినాడని తెలిసింది. కనుక ఏ విధములైన భావములచేత, ఏ విధమైన కారణములచేత, ఏ విధమైన ఆహారము మనము భుజిస్తున్నామో ఆ కారణాలు, ఆ భావాలు మనలో ప్రతిబింబిస్తాయి. కనుక పూర్వకాలములో ఋషులు గ్రామములలో నివసించక ఎవరి ఆహారము పుచ్చుకొనకుండా కంద మూలాదులు తింటూ అడవిలో ఉన్న ఆహారమును భుజిస్తూ ఉండటానికి యిదే మూలకారణము.

మీ అందరిని అరణ్యమునకు పొమ్మని చెప్పటం లేదు. మీరు పోరు నాకు తెలుసు. కానీ మనము ఇక్కడనే ఉంటుండి ఈ పదార్థములయొక్క దోషములను పరిహారము గావించవలెనన్న పరమాత్మకు అర్పితము గావించాలి. అర్పితము గావించకుండా భుజించుట చేతనే మనకు అనేక రకములైన దుర్భావములు అభివృద్ధి అవుతున్నాయి. ఈ దుర్భావములకు మన ఆహారమే మూలకారణము. ఈ ఆహారములో నా దోషము ఉంటున్నాది. ఆహారము సంపాదనలో నా

srisathyasaivachanamrutam

దోషము ఉంది. ఈ ఆహారము ఉండటంలోను దోషముంది. ఈ ఆహారము వండే వానిలోను దోషముంది. భగవదర్పితం గావించి భుజించినది ప్రసాదముగా రూపొందుతుంది. కనుక ప్రతి వ్యక్తి కూడను ఎవరేమనుకున్నా ఫరవాలేదు. మనము సరియైన రీతిలో ప్రార్థించుకొని దానిని అర్పితము గావించుకోవాలి.

కనుకనే మీరా తనకిచ్చిన విష క్షీరమును కృష్ణునికి అర్పితము చేసింది. ఇది విషమా పాలా ఆమెకేమి కనిపించలేదు. ఏమిచ్చినా కృష్ణార్పణం అనేది. కృష్ణునికి మొట్టమొదట పెట్టి తదుపరి తాను ప్రసాదంగా భుజించేది. కృష్ణునికి ఈ ప్రసాదము ఇచ్చేటప్పటికి ఈ విషమంతా కృష్ణునికి పోయి blueగా మారిపోయినాడు. ఆ తెల్లటి పాలంతా మీరా లోపల చేరినాయి. తక్షణమే పూజరూములో విగ్రహాన్ని చూసింది. కృష్ణుడు నీలంగా మారిపోయినాడు. భరించుకోలేక పోయింది. తెల్లటి మార్బుల్ జైపూర్ నుండి తెప్పించుకొని ప్రతిష్ఠ చేయించుకుంది పాపం. అలాంటిపరిశుద్ధమైన చలువరాతి కృష్ణుడు నీలముగా మారిపోవటానికి కారణమేమని భావించింది. ఈ విధముగా విచారిస్తూ విచారిస్తూ కృష్ణుని పాదాలపైన పడింది. మహారాణా వచ్చాడు. మహాక్రోధుడై వచ్చాడు. చేతిని బట్టి బయటకు లాగేశాడు. నీవు ఇక్కడ ఉండటానికి వీలులేదు. నేను మహారాజును. నా గౌరవ మర్యాదలంతా మంట గలుపుతున్నావు. ఈ మందిరము నేను కట్టించినది. నేను కట్టించిన మందిరములో నీవు ఉండటానికి వీలు లేదు అన్నాడు. మీరా బాధలో ఉంటుండాది. కృష్ణుడు ఈ విధముగా నీలముగా మారటానికి కారణమేమని చింతిస్తున్నది. ఈ లోపలనే ఆయన నా మందిరము అని వచ్చినాడు. కొంచెం బాధ కలిగింది. తదుపరి ధైర్యం తెచ్చుకుంది. మహారాణా ఈ మందిరము నీవు కట్టించావు. ఈ విగ్రహం నీవు ప్రతిష్ఠించినదే. కానీ నా హృదయ మందిరము నీవు కట్టించలేదు. నా కృష్ణుడే కట్టించుకున్నాడు. నా హృదయమునందు తానే ప్రతిష్ఠయై ఉన్నాడు. దీని నుంచి పొమ్మని చెప్పటానికి ఎవ్వరికి అధికారము లేదు.

**ఓ మనసా! భగవంతుని ఆశ్రయించు**

ఓ మనసా! ఈ మమకారాన్ని నీవెందుకు ఇక్కడ పెట్టుకుంటున్నావు. ఈ అభిమాన మమకారముల చేతనే నాకిన్న బాధలు కలుగుతున్నాయి అని మనసుకు బుద్ధి చెప్పింది.

srisathyasaivachanamrutam

'ఛలోరే మన్ గంగా యమునా తీర్' ఓ మనసా నీవు వెళ్లిక. ఆ గంగా యమునా స్థానమునకు అనగా భ్రూమధ్య స్థానములో చేరు. అదే ప్రయాగ. ఆ ప్రయాగకు టిక్కెట్టు తీసుకొని రైల్లో బస్సులో పోవటానికి ప్రయత్నించ లేదు. ఆ గంగా యమునా త్రివేణి సంగమమంతా నాలోనే ఉంటుండాది. 'చలోరె మన్ గంగా యమునా తీర్' గంగ యిడ, యమున పింగళి. రెండింటికి మధ్య భూస్థానమే సుషుమ్న. అదే ప్రయాగ. ఈ ప్రయాగ అనే భ్రూమధ్య స్థానములో చేరు. ఓ మనసా! దీన్ని దానిని దేనిని అంగీకరించకు. ఆ విధంగా మనస్సును భ్రూమధ్య స్థానానికి పంపించింది. స్తంభించి పోయింది. తక్షణమే కృష్ణునిలో ఐక్యమై పోయింది. ఈ గాఢమైన విశ్వాసము ఉండటం చేతనే, నామస్మరణ వదలకుండటం చేతనే మీరాకు ఇన్ని బాధలు కలిగినప్పటికిని ఆమెకు ఈ పవిత్రమైన స్థానం ప్రాప్తించింది.

కనుక మనం అఖండమైన విశ్వాసాన్ని, పరిపూర్ణమైన ప్రేమతత్వాన్ని నిస్సందేహమైన నిశ్చలమైన భావాన్ని అభివృద్ధి గావించుకోవాలి. మనదంతా డమ్మీ డాన్సు పొద్దున్న ఒక మాదిరి, సాయంకాలం ఒక మాదిరి. balance లేదు. ఈ నాటక మాడుతూ ఉంటే భగవంతుడు ఏరీతిగా మనకు లభ్యమవుతాడు. ఈ two horse race చాలా danger. ఒక గుఱ్ఱాన్ని మాత్రమే నీవెక్కు. అంతేగాని రెండు గుఱ్ఱాలపైన కూర్చుంటే అది ఇట్ల పోతుంది. ఇది అట్లా పోతుంది. మధ్యలో నీవు హతమైపోతావు. కనుక ఒక విశ్వాసము చేతనే భగవంతుని స్మరిస్తూ రావాలి. ఆ విధమైన నిశ్చలత్వాన్ని అనుగ్రహించే నిమిత్తమై మన కాలేజియందు ఒక ప్రార్థన, సుప్రభాతం ఓంకారము ఇత్యాదులంతా నియమించటంలోని అంతరార్థములు. దీన్ని మీరు అర్థం చేసుకోకుండా ఏమిట్రా నిబంధనలు, ఏమిట్రా ఈ కట్టుబాట్లు ఏమిట్రా ఈ discipline అనుకుంటే యిది కేవలము తెలివితక్కువే. పోనీ మీకు అవి సరైన రీతిగా అర్థం కాకుండాపోతే వెళ్ళిపోవచ్చును. తప్పేమీ లేదు. ఎవరూ ఎవరిని బాధించరు. నీవు అంగీకరించే ఇక్కడకు వచ్చి నీ అంగీకారమునకు నీవు విరుద్ధముగా పోయినప్పుడు నీకు నీవు ద్రోహం చేసుకున్న వాడవౌతావు. నీకు నీవు ఆత్మద్రోహి కాకూడదు. నిన్ను నీవు చంపుకోకూడదు.

నీ హృదయాన్ని నీ విచారం గావించుకో. ఇతరుల నిమిత్తమై నీవేమాత్రము చింతించకూడదు. ఎవరేమనుకుంటారో అనే అభిమాన మమకారములకు అవకాశము



srisathyasaivachanamrutam

ఇవ్వకూడదు. నీ అభిమాన మమకారములంతా భగవంతుని పైన పెట్టి నీవే తప్ప యితః పరంబెరుగ నీవు తప్ప నాకింక అన్యము లేదు అనే భావముతో ఉండినప్పుడే మనకు ఈ లౌకిక విద్యలు పారమార్థిక విద్యలు, వైజ్ఞానిక విద్యలు అన్ని విద్యలు లభ్యమవుతాయి.

ప్రహ్లాదుడు కూడను విద్యావంతుడే. అతను కూడను విద్యార్థియే. కాని గురువులు ఏమి చెప్పినా, తండ్రి ఏమి చెప్పినా భగవద్విరోధమైన మాటను ఏమాత్రము అంగీకరించలేదు. తండ్రియైనాసరే భగవద్విరోధముగా చెప్పినప్పుడు తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించమని చెప్పాడు. భర్త అయినాసరే భగవద్విరోధముగా బోధించినప్పుడు మీరావలె భర్తనైనా త్యజించమని చెప్పాడు. తండ్రియైనాసరే ప్రహ్లాదునివలె విసర్జించమన్నాడు. తల్లినైనాసరే భగవద్విరోధంగా బోధించినప్పుడు భరతుడు కైకను ఏవిధంగా విసర్జించాడో ఆ విధముగా విసర్జించమన్నాడు. సోదరునైనా సరే ఏ విధముగా విభీషణుడు విసర్జించాడో రావణాసురుని ఆ విధంగా విసర్జించమని చెప్పాడు. కనుక భగవద్వాక్యమునకు విరోధము వచ్చినప్పుడు ఎవరినైనా విసర్జించమని చెప్పాడు. కట్టకడపట గురువు దగ్గర కూడను ఇదే బోధిస్తూ వచ్చాడు. బలిచక్రవర్తి గురువు శుక్రాచార్యుడు. అతడు బోధించాడు 'బలిచక్రవర్తీ! వచ్చినవాడు బ్రాహ్మణుడనుకుంటున్నావు. ఇతడు బ్రాహ్మణుడు కాదు ముల్లోకాధిపతి. ఇతను నిన్ను ఆశ్రయించటానికి వచ్చాడు. కాని నీవేమాత్రము అతనికి భిక్ష పెట్టవద్దు అన్నాడు. ముల్లోకాధిపతి అని తెలుసుకున్న నీవే చెప్తున్నావు.

ఆ ముల్లోకాధిపతి వచ్చి నా దగ్గర చేయి క్రిందపెట్టినప్పుడు నా చేయి అతనిపైన పోవటము నాకెంత అదృష్టము అన్నాడు. బలిచక్రవర్తి నా అదృష్టమింతే చాలు భగవంతుడు వచ్చి నన్నడగటమేమిటి నేను అతనికి ఇవ్వటమేమిటి ఇది నా అదృష్టము అన్నాడు. భగవంతుని చేయి క్రింద పడింది. ఇచ్చే చేయిపైన ఉంటుండాది. ఇదే మహాభాగ్యమనుకున్నాడు. గురువాజ్ఞ అయినా ఉల్లఘించి దానం చేశాడు. కాన భగద్విషయము లోపల ఇలా గాఢమైన విశ్వాసముతో మనము సరియైన సాధన చేసినప్పుడు మనకెంతటి దైవ విజయం లభిస్తుంది. ఎలాంటి కార్యమైనా విజయమే మనలను వర్తిస్తుంది.

మీ పరీక్షల విజయముగాని, మీ సంసార విజయంగాని, మీ వ్యాపార విజయంగాని, ఉద్యోగ విజయంగాని, ఇంకే విజయమైనా భగవదనుగ్రహము సాధించలేనిది ఒక్కటి కూడను

srisathyasaivachanamrutam

జగత్తులో లేదు. భగవంతుని దగ్గర పెట్టుకోవాలి అంతే చాలు. అన్ని విజయాలు అక్కడే సాధించుకోవచ్చు. అదే భగవద్గీతలో కట్టకడపటి శ్లోకము.

**యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.**

ఇన్ని రకములైన ఫలితాలు మనకు లభిస్తాయిట. ఎక్కడ భగవంతుణ్ణి హృదయములో పెట్టుకొని యేవిధంగా నీవు ధైర్యంతో, విశ్వాసముతో అతనిని ప్రార్థిస్తావో సర్వ విజయములు నీకు చేకూరుతవి అన్నాడు.

**(తేది. 22-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam